క్లుప్తంగా

బస్సు పాసుల జారీ తాత్కాలికంగా నిలిపివేత

నందికొట్కూరు:సాఫ్ట్‌వేర్ ఆధునీకరణ కారణంగా ప్రయాణికులు, విద్యార్థులకు బస్ పాస్‌ల జారీని తాత్కాలికంగా నిలిపివేసినట్లు ఆర్టీసీ డిపో మేనేజర్ గురువారం ఓ ప్రకటనలో తెలిపారు. బస్సు పాసులు ఇచ్చే సాఫ్ట్‌వేర్ ఈ నెల 5, 6 తేదీల్లో అప్‌డేట్ చేస్తుండడం వల్ల అంతరాయం ఉంటుందన్నారు. ఈ నెల 7వ తేదీ నుంచి యథావిధిగా బస్సు పాసుల కౌంటర్‌లో జారీ చేస్తామని పేర్కొన్నారు. ప్రయాణికులు, విద్యార్థులు గమనించాలని సూచించారు.

450 క్వింటాళ్ల శనగ విత్తనాలు మంజూరు

పగిడ్యాల:రబీ సీజన్‌లో శనగ పంట సాగు చేసే రైతాంగం కోసం మండలానికి 450 క్వింటాళ్ల విత్తనాలు మంజూరైనట్లు వ్యవసాయ అధికారి విజయ్‌జ్యోతకుమార్ గురువారం తెలిపారు. క్వింటా రూ. 9400 కాగా ప్రభుత్వ సబ్సిడీ రూ. 2350 ఉందన్నారు. 20 కేజీల ప్యాకెట్ రూ. 1410గా నిర్ణయించినట్లు వెల్లడించారు. శనగ పప్పు సాగు చేసే రైతులు సమీపంలోని రైతు సేవా కేంద్రాల్లో రిజిస్ట్రేషన్ చేయించుకోవాలన్నారు. రిజిస్ట్రేషన్ కోసం తప్పనిసరిగా ఆధార్ కార్డు, ఫోన్ నంబరును రైతు సేవా కేంద్రంలో అందజేయాలన్నారు. రిజిస్ట్రేషన్ చేయించుకున్న రైతులు ఈ పంట నమోదు కూడా చేయించుకోవాలని తెలిపారు. ఒక బస్తా నుంచి గరిష్టంగా 10 బస్తాల వరకు విస్తీర్ణంను బట్టి ఇస్తామని ఏఓ పేర్కొన్నారు. ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

ఈఓపీఆర్డీ, ట్రాన్స్‌కో ఏఈ బదిలీ

జూపాడుబంగ్లా: మండల పరిషత్ కార్యాలయంలో ఈఓపీఆర్డీగా విధులు నిర్వహిస్తున్న మధుమోహన చక్రవర్తి హోళగుంద మండలానికి బదిలీ అయ్యారు. అలాగే కార్యాలయంలో టైపిస్టుగా పనిచేస్తున్న హర్షిణీ నందికొట్కూరుకు బదిలీ అయ్యారు. వీరి స్థానంలో ఎవరినీ నియమించలేదు. అలాగే మండల ట్రాన్స్‌కో ఏఈ రామాచారి కర్నూలుకు బదిలీ కాగా ఆయన స్థానంలో కర్నూలు ట్రాన్స్‌కో ఎస్ఈ కార్యాలయంలో విధులు నిర్వహిస్తున్న ఏఈ కృష్ణమూర్తి జూపాడుబంగ్లా ఏఈగా వచ్చారు.

పలువురు అధికారులకు స్థాన చలనం

పగిడ్యాల: స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో డిప్యూటీ తహసీల్దార్‌గా పనిచేస్తున్న రవికుమార్ డోన్ ఆర్డీఓ కార్యాలయానికి బదిలీ అయ్యారు. అలాగే మండల సర్వేయర్‌గా విధులు నిర్వహిస్తున్న శ్రీనువాసులు కర్నూలు హెచ్ఎన్ఎస్ఎస్ యూనిట్‌కు బదిలీపై వెళ్లారు. ఈయన స్థానంలో సంజామల మండల సర్వేయర్ జ్ఞానప్రకాష్ పగిడ్యాలకు నియమితులయ్యారు. రెవెన్యూ ఇన్‌స్పెక్టర్ శ్వేత ప్యాపిలి మండలానికి బదిలీ కాగా జూపాడుబంగ్లా రెవెన్యూ ఇన్‌స్పెక్టర్ పి.ఎం. రంగారెడ్డి పగిడ్యాలకు వచ్చారు. సీనియర్ అసిస్టెంట్ రాధిక మిడుతూరు మండలానికి, పాత ముచ్చుమర్రి వీఆర్వో నరసింహుడు నందికొట్కూరు, కొత్త ముచ్చుమర్రి వీఆర్వో మద్దిలేటి దామగట్లకు, లక్ష్మాపురం-2 వీఆర్వో హరినాథ్ లక్ష్మాపురం-1 గ్రామానికి, లక్ష్మాపురం-1 వీఆర్వో భగవాన్‌దాస్ లక్ష్మాపురం-2 గ్రామానికి, పగిడ్యాల-3 గ్రామ వీఆర్వో హరిత రైతు నగరం, పగిడ్యాల-2 వీఆర్వో నాగన్న పగిడ్యాల-1 గ్రామానికి బదిలీ అయినట్లు తహసీల్దార్ శివరాముడు వెల్లడించారు.

ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈగా జుబేర్

కొత్తపల్లి: మండల ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈగా జుబేర్ గురువారం బాధ్యతలు తీసుకున్నారు. ఈయన తిరుపతి జిల్లా కేవీబీపురం మండల ఏఈగా విధులు నిర్వహిస్తూ సాధరణ బదిలీల్లో భాగంగా కొత్తపల్లి మండలానికి వచ్చారు. ఇక్కడ ఏఈగా పనిచేస్తున్న త్రిలింగేశ్వరరెడ్డి బదిలీపై శిరివెళ్ల మండలానికి వెళ్లారు. ఈ సందర్భంగా ఏఈ మాట్లాడుతూ.. మండలంలో నీటి సమస్య తలెత్తకుండా చర్యలు తీసుకుంటామని తెలిపారు.

విద్యుత్ ప్రమాదం

పాములపాడు: మండలంలోని రుద్రవరం గ్రామంలో గురువారం జరిగిన విద్యుత్ ప్రమాదంలో ఇంట్లోని సామగ్రి పూర్తిగా దగ్ధమైంది. బాధితుడు బంకల ఆనంద్‌కుమార్ తెలిపిన వివరాల మేరకు.. ఇంట్లోని పైగదిలో అనుకోకుండా మంటలు చెలరేగాయి. గమనించిన కాలనీవాసులు కేకలు వేయడంతో అప్రమత్తమై మంటలు ఆర్పేందుకు యత్నించారు. అప్పటికే ఇంటిలోని విద్యుత్ ఉపకరణాలు పూర్తిగా కాలిపోయాయి. ప్రమాదంలో సుమారు రూ.1.50 లక్షల మేర ఆస్తి నష్టం సంభవించినట్లు బాధితుడు తెలిపాడు.

తైక్వాండో పోటీలకు విద్యార్థి ఎంపిక

ఆత్మకూరు: రాష్ట్రస్థాయి తైక్వాండో పోటీలకు షేక్ అబ్దుల్ రహమాన్ అనే విద్యార్థి ఎంపికై నట్లు గురువారం డీపాల్ స్కూల్ ప్రిన్సిపాల్ ఫాదర్ షీన్స్ తెలిపారు. స్థానిక పాఠశాలలో గురువారం ఆ విద్యార్థిని ప్రత్యేకంగా అభినందించారు. గత నెల 30న నంద్యాల జిల్లా డీఎస్‌డీఓ స్టేడియంలో జరిగిన జిల్లా స్థాయి తైక్వాండో పోటీల్లో అండర్-17 విభాగంలో బంగారు పతకం సాధించి, ఈనెల 6వ తేదీన తిరుపతి జిల్లాలో జరిగే తైక్వాండో రాష్ట్రస్థాయి పోటీలకు అర్హత సాధించాడన్నారు. అభినందించిన వారిలో ఆత్మకూరు కేవీకే ఇండోర్ స్టేడియం ఇన్‌చార్జ్ ఎస్.కె.జునైద్‌బాషా, ఆత్మకూరు స్పోర్ట్స్ క్లబ్ చైర్మన్ పసిఫిల్ మున్నా, ఆసిఫ్‌బేగ్ ఉన్నారు.

దేవీ..దీవించు

- ఘనంగా ప్రారంభమైన దేవీశరన్నవరాత్రోత్సవాలు
- వివిధ రూపాల్లో భక్తులకు దర్శనమిచ్చిన అమ్మవార్లు

ఆత్మకూరు: విజయదశమిని పురస్కరించుకుని శ్రీశైలం, నందికొట్కూరు నియోజకవర్గాల్లో దేవీశరన్నవరాత్రోత్సవాలు ఘనంగా ప్రారంభమయ్యాయి. మొదటి రోజు గురువారం అమ్మవారిని వివిధ రూపాల్లో ప్రత్యేకంగా అలంకరించారు. ఆలయాల్లో బొమ్మల కొలువులు ఏర్పాటు చేశారు. హోమాలు, అభిషేకాలు, లలితా సహస్రనామ పారాయణం, బుర్రకథ, హరికథ, కోలాటాలు, అన్నమాచార్య సంకీర్తనలు నిర్వహించారు. భక్తులు అమ్మవార్లను దర్శించుకుని మొక్కులు చెల్లించుకున్నారు.

శరన్నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా ఆత్మకూరులో అమ్మవార్లను ప్రత్యేకంగా అలంకరించారు. వాసవీ కన్యకాపరమేశ్వరి ఆలయంలో అమ్మవారిని అనఘా దేవిగా చౌడేశ్వరిదేవి ఆలయం, శివాలయంలలో అమ్మవార్లను బాలత్రిపుర సుందరీదేవిగా అలంకరించి భక్తులకు దర్శనం కల్పించారు. అంబాభవానీ దేవాలయంతో పాటు పాత బస్టాండ్‌లోని ఆంజనేయస్వామి, సత్యసాయి దేవాలయం, వెంకటేశ్వరస్వామి ఆలయాల్లో వివిధ రూపాల్లో అమ్మవార్లు భక్తులకు దర్శనమిచ్చారు. ఉదయం నుంచి ఆయా ఆలయాల్లో కుంకుమార్చన, ప్రత్యేక పూజలు, హోమాలు జరిగాయి.

బండిఆత్మకూరు: కాకనూరు శారదా పీఠంలో దేవి శరన్నవరాత్రోత్సవాల సందర్భంగా అమ్మవారిని స్వర్ణ కవచాలం కృత దుర్గాదేవిగా అలంకరించారు. అమ్మవారికి ఉదయం గణపతి పూజ, పుణ్య వాచనం, కలశ స్థాపన, సాయంకాలం లలిత సహస్ర పారాయణం, సామూహిక కుంకుమార్చన నిర్వహించారు. ఈ పూజా కార్యక్రమాలన్ని శారదా పీఠం పీఠాధిపతులు శివ యోగేంద్ర సరస్వతి స్వామి పర్యవేక్షణలో జరిగాయి.

వెలుగోడు: పట్టణంలోని వాసవి కన్యకా పరమేశ్వరి ఆలయంలో అమ్మవారు బాలాత్రిపుర సుందరి దేవి అలంకరణలో దర్శనమిచ్చారు. పురోహితులు ప్రత్యేక పూజలు నిర్వహించి భక్తులందరికి తీర్థ ప్రసాదాలు అందజేశారు.అలాగే వేల్పనూరులో అంకాల పరమేశ్వరి దేవిని శైలపుత్రి దుర్గగా అలంకరించారు.

నందికొట్కూరు: స్థానిక శ్రీవాసవీ కన్యకాపరమేశ్వరి ఆలయంలో అమ్మవారు బాలా త్రిపురసుందరీదేవి అలంకారంలో భక్తులకు దర్శనమిచ్చారు. ఉదయం గణపతి పూజ, పుణ్యాహవాచనం, రక్షాబంధనం, కలశ స్థాపన, అభిషేక పారాయణాలు, జపాలు, మంగళ హారతి, సాయంత్రం షోడసోపచార పూజ, హారతి స్వస్తి, సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించారు.

పగిడ్యాల: మండలంలోని నెహ్రూనగర్ రామాలయం వద్ద దుర్గాదేవి మొదటి రోజు బాలాత్రిపుర సుందరి అలంకరణలో భక్తులను కటాక్షించారు.

జూపాడుబంగ్లా: తాటిపాడు, జూపాడుబంగ్లా, తూడిచెర్ల, పారుమంచాల గ్రామాల్లో అమ్మవారి విగ్రహాలను ప్రతిష్టించి పంచామృతాభిషేకం, పుష్పార్చన, కుంకుమార్చన, సహస్త్రనామార్చన తదితర పూజలు చేశారు. ఉత్సవాల్లో మొదటి రోజు అమ్మవారు బాలత్రిపురసుందరీమాతగా భక్తులకు దర్శనమిచ్చారు.

పాములపాడు: స్థానిక చౌడేశ్వరీదేవి ఆలయంలో అమ్మవారు గాయత్రీదేవిగా పూజలందుకున్నారు. ఉదయం గణపతి పూజ, కుంకుమార్చన, సహస్రనామావళి, పంచామృతాభిషేకాలు చేశారు. సాయంత్రం అమ్మవారి పల్లకీ సేవ నిర్వహించారు.

మిడుతూరు: స్థానిక కన్యకాపరమేశ్వరి ఆలయం, చౌడేశ్వరీదేవి ఆలయాల్లో దేవీ శరన్నవరాత్రులు ఘనంగా ప్రారంభమయ్యాయి. మొదటి రోజు అమ్మవార్లను బాలాత్రిపురసుందరిదేవిగా అలంకరించారు. భక్తులు అమ్మవారిని దర్శించుకుని మొక్కులు తీర్చుకున్నారు.


జూపాడుబంగ్లా: తాటిపాడులో అమ్మవారికి ప్రత్యేక పూజలు చేస్తున్న భక్తులు


వెలుగోడులో బాలాత్రిపుర సుందరి దేవి అలంకరణలో అమ్మవారు


వేల్పనూరులో శైలపుత్రి దేవి అలంకరణలో అమ్మవారు


పాములపాడు: కుంకుమార్చన చేస్తున్న మహిళలు


మిడుతూరు: కన్యకాపరమేశ్వరి ఆలయంలో..


మిడుతూరు: బాలాత్రిపుర సుందరీదేవి,


కాకనూరులో అమ్మవారిని ఊరేగిస్తున్న దృశ్యం


ఆత్మకూరులో అనఘాదేవి రూపంలో వాసవీ కన్యకాపరమేశ్వరి

అధిక ధరలకు రాయితీ విత్తనాలివ్వడం తగదు

జూపాడుబంగ్లా: రాయితీపై రైతులకు విత్తనాలిస్తున్నామంటూనే టీడీపీ ప్రభుత్వం అధిక ధరలకు రాయితీ విత్తనాలివ్వడం సమంజసంగా లేదని వైఎస్సార్‌సీపీ జేసీఎస్ మండల కన్వీనర్, పి.లింగాపురం సర్పంచ్ నాగార్జునరెడ్డి అన్నారు. గురువారం మండలంలోని తరిగోపుల రైతు సేవా కేంద్రంలో రైతులకు రాయితీ విత్తనాలు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రభుత్వం రైతులకు రాయితీపై శనగ విత్తనాలు మంజూరు చేయడం సంతోషించదగిన విషయమైనప్పటికీ అధిక ధరలకు రాయితీ విత్తనాలివ్వడం బాధాకరమన్నారు. బహిరంగ మార్కెట్‌లో క్వింటా శనగ విత్తనాలు రూ.7,500లకు వస్తున్నట్లు తెలిపారు. టీడీపీ ప్రభుత్వం రాయితీపై శనగ విత్తనాలు ఇస్తున్నామని పేర్కొంటూ క్వింటా శనగలు రూ.9,400 కాగా 25శాతం రాయితీ రూ.2,350 పోను రూ.7,045లకు ఇస్తున్నట్లు తెలిపారు. దీన్ని బట్టి చూస్తే రైతులకు ప్రభుత్వం ఎలా రాయితీ ఇచ్చినట్లు అవుతుందని ప్రశ్నించారు. ప్రభుత్వం రాయితీ శనగ విత్తనాలు ఇస్తున్నప్పుడు బహిరంగ మార్కెట్ కంటే తక్కువగా ఉండాలే తప్పా అధికంగా ఉండటం సబబుకాదన్నారు. అలాగే కౌలు రైతులకు సత్వరమే గుర్తింపు కార్డులు ఇవ్వడంతో పాటు బ్యాంకుల్లో రుణాలిప్పించి ఆదుకోవాలని కోరారు.


రైతులకు రాయితీ శనగ విత్తనాలను పంపిణీ చేస్తున్న సర్పంచ్ నాగార్జునరెడ్డి

శ్మశాన వాటికకు స్థలం కేటాయించాలని వినతి

జూపాడుబంగ్లా: మండలంలోని 80బన్నూరు గ్రామంలో శ్మశాన వాటికకు స్థలం కేటాయించి పుణ్యం కట్టుకోండి సార్ అంటూ గ్రామానికి చెందిన దళితులు తహసీల్దార్ చంద్రశేఖర్‌నాయక్‌కు గురువారం విజ్ఞప్తి చేశారు. గ్రామంలో ఇది వరకు దళితులకు ఉన్న శ్మశాన వాటిక జాతీయ రహదారి 340సీ నిర్మాణంలో పోయింది. దానికి ప్రత్యామ్నాయంగా మరోచోట శ్మశానవాటికకు స్థలం కేటాయించారు. అదికాస్త వివాదాస్పదంగా మారడంతో అందులో అంత్యక్రియలు నిర్వహించడం లేదు. గ్రామానికి చెందిన సుంకన్న అనే వ్యక్తి మృతిచెందడంతో అతని మృతదేహానికి అంత్యక్రియలు నిర్వహించేందుకు స్థలం చూపించాలని తహసీల్దార్‌ను కోరారు. శ్మశానవాటికకు స్థలం కేటాయింపు విషయం కలెక్టర్ సమక్షంలో త్వరలో పరిష్కారం అయ్యే అవకాశం ఉన్నందున అప్పటి వరకు పాత శ్మశానవాటికలోనే అంత్యక్రియలు నిర్వహించుకోవాలని తహసీల్దార్ చంద్రశేఖర్‌నాయక్ గ్రామస్తులకు సర్ది చెప్పారు.


స్థలం కేటాయించాలని తహసీల్దార్‌ను కోరుతున్న దళితులు

ఆలయ అభివృద్ధికి కృషి


మహానంది: మహానంది ఆలయ అభివృద్ధికి కృషి చేస్తానని శ్రీశైలం ఎమ్మెల్యే బుడ్డా రాజశేఖరరెడ్డి తెలిపారు. మహానందీశ్వరుడి దర్శనార్థం గురువారం మహానందికి వచ్చిన ఆయన కోనేరుల పునర్నిర్మాణ పనులు, నిశ్చితార్థ మండప నిర్మాణాలకు భూమిపూజ చేశారు. ఈఓ నల్లకాలువ శ్రీనివాసరెడ్డితో కలిసి ముందుగా శ్రీ కామేశ్వరీదేవి సహిత మహానందీశ్వరస్వామి వార్లను దర్శించుకుని పూజలు చేపట్టారు. అనంతరం రూ. 55 లక్షలతో కోనేరుల మరమ్మతుల పనులకు భూమిపూజ చేశారు. దీంతో పాటు మహానందీశ్వరస్వామి నిశ్చితార్థ మండపం నిర్మాణం కోసం గుండంపాడు, గుండుపాపలకు చెందిన దాతలతో కలిసి భూమిపూజ చేశారు. కాగా ఆయా పనులకు వైఎస్సార్‌సీపీ ప్రభుత్వ హయాంలోనే నిధులు మంజూరయ్యాయి.

శనగ విత్తనాలు పంపిణీ

నందికొట్కూరు: పట్టణంలోని వ్యవసాయ శాఖ కార్యాలయం వద్ద ఆత్మ భవనంలో ఎమ్మెల్యే జయసూర్య గురువారం రైతులకు శనగ విత్తనాలు పంపిణీ చేశారు. నియోజకవర్గ రైతులకు 9 వేల క్వింటాళ్ల మంజూరు చేయాలని ప్రభుత్వానికి నివేదికలు అందించామని తెలిపారు. ప్రస్తుతం 5వేల క్వింటాళ్ల శనగలు ప్రభుత్వం రబీ సీజన్‌కు విడుదల చేసిందన్నారు. ఇటీవల కురిసిన వర్షాలకు దెబ్బతిన్ని పంటలకు నష్టం పరిహారం చెల్లించేందుకు ప్రభుత్వం చర్యలు తీసుకుంటుందని స్పష్టం చేశారు. నందికొట్కూరు మండలానికి 1550 క్వింటాళ్లు, మిడుతూరు 1808, జూపాడుబంగ్లాకు 850, పగిడ్యాలకు 450, పాములపాడు 426, కొత్తపల్లి మండలానికి 250 క్వింటాళ్లు మంజూరు చేసినట్లు వివరించారు. వ్యవసాయ శాఖ ఏడీఏలు ఆంజనేయులు, విజయశేఖర్, ఏఓలు పాల్గొన్నారు.

శ్రీశైలం..దేదీప్యమానం


వివిధ రకాల పుష్పాలతో శ్రీశైల ఆలయాన్ని అలంకరించిన దృశ్యం


విద్యుద్దీపాలంకరణలో మల్లన్న రూపం

శ్రీశైలంటెంపుల్: శ్రీశైల మహాక్షేత్రం దసరా ఉత్సవ శోభతో కళకళలాడుతోంది. ఉత్సవాలను పురస్కరించుకుని ఉభయ దేవాలయాల్లోని ధ్వజస్తంభాలను, ఆలయాల ప్రధాన ద్వారాలను వివిధ రకాల పుష్పాలతో అలంకరించారు. అలాగే స్వామి అమ్మవార్ల గోపురాలు, ఆలయంలోని పలు ఉపాలయాలకు, ప్రధాన ఆలయానికి ఎదురుగా గంగాధర మండపం వద్ద పరమేశ్వరుడిని పోలిన ప్రతిమలకు విద్యుద్దీపాలు ఏర్పాటు చేశారు. ఈదీప కాంతులతో శ్రీశైల ఆలయం వెలుగొందుతుంది. స్వామిఅమ్మవార్ల సందర్శనకు వచ్చిన పలువురు భక్తులు ఆలయంలో పూలతో, విద్యుత్ లైట్లతో అలంకరించిన సుందర దృశ్యాలను చూసి ముగ్దులవుతున్నారు.

అవీ-ఇవీ

ప్రజలకు అందుబాటులో శిల్పా

బండిఆత్మకూరు: శ్రీశైలం నియోజకవర్గ మాజీ ఎమ్మెల్యే శిల్పా చక్రపాణి రెండు రోజుల పాటు నంద్యాల పద్మావతి నగర్‌లోని వైఎస్సార్‌సీపీ కార్యాలయంలో ప్రజలకు, పార్టీశ్రేణులకు అందుబాటులో ఉంటారు. బండిఆత్మకూరు పార్టీ నాయకులకు, కార్యకర్తలకు, సోషల్ మీడియా సైనికులకు దిశానిర్దేశం చేయనున్నట్లు ఒక ప్రకటనలో తెలిపారు.

దేశెట్టి బెస్ట్ సర్వీస్ అవార్డుకు ఎంపిక

నందికొట్కూరు: పట్టణంలో 20 ఏళ్ల నుంచి సేవా కార్యక్రమాలు చేస్తున్న ఆర్ట్ దేశెట్టి శ్రీనివాసులుకు హ్యూమన్ రైట్స్ ఆర్గనైజేషన్ ఆల్ ఇండియా సంస్థ బెస్ట్ సర్వీస్ అవార్డుకు ఎంపిక చేసింది. 20 ఏళ్ల అనాథలకు అన్నదాన కార్యక్రమాలు, సేవలు, 20 సార్లు రక్తదానం ఇతరత్రా కార్యక్రమాల నేపథ్యంలో ఆయనకు ఈ అవార్డు వరించింది.

మద్యం దుకాణాలకు దరఖాస్తు చేసుకోండి

ఆత్మకూరు: ఆత్మకూరు ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ డిపార్ట్‌మెంట్ పరిధిలో మద్యం దుకాణాలకు దరఖాస్తు చేసుకోవాలని ఎక్సైజ్ సీఐ కిషోర్‌కుమార్ తెలిపారు. గురువారం ఆయన విలేకరులతో మాట్లాడారు. ఆత్మకూరు డివిజన్‌లోని ఆత్మకూరు మున్సిపాలిటీ పరిధిలో 4, రూరల్ పరిధిలో రెండు, కొత్తపల్లి, పాములపాడు మండలాల్లో ఒక్కొక్కటి, శ్రీశైలం మండలంలో రెండు, వెలుగోడు మండలంలో మూడు మద్యం దుకాణాలు ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు.

సమగ్ర విచారణ చేపట్టాలి

వెలుగోడు: మండలం లోని కేజీబీవీ పాఠశాల నుంచి బియ్యం బస్తాల తరలింపుపై విచారణ చేపట్టాలని బీజేపీ నాయకులు గురువారం ఎంఈఓ బ్రహ్మం నాయక్‌ను కలిసి విన్నవించారు. కార్యక్రమంలో పార్టీ జిల్లా కార్యదర్శి వడ్ల ప్రతాప్ ఆచారి, బీజేవైఎం జిల్లా ప్రధాన కార్యదర్శి నూలు నాగేశ్వరరావు, పురుషోత్తం గౌడ్ పాల్గొన్నారు.

పెండింగ్ బకాయిలు చెల్లించాలి

ఆత్మకూరు: ఉద్యోగ, ఉపాధ్యాయులకు సంబంధించిన పెండింగ్ బకాయిలను వెంటనే చెల్లించాలని గిరిజన ఉద్యోగుల సంక్షేమ సంఘం జిల్లా అధ్యక్షుడు జవహర్ నాయక్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. గురువారం ఆయన ఆత్మకూరు పట్టణంలో విలేకరులతో మాట్లాడారు. ఉద్యోగ, ఉపాధ్యాయులకు ఇవ్వాల్సిన ఐదు డీఏలు పెండింగ్‌లో ఉన్నాయని, 11వ పీఆర్‌సీ బకాయిలు పెండింగ్‌లో ఉన్నాయని, కుటుంబ అవసరాల కోసం సరెండర్ లీవ్ ఎన్ క్యాస్‌మెంట్ పెడితే గత రెండు సంవత్సరాల నుంచి పెండింగ్‌లో ఉన్నాయన్నారు. దసరా పండగలోపు పెండింగ్ బకాయిలు చెల్లించి, 12వ పీఆర్‌సీ ప్రకటించి 30 శాతం మధ్యంతర భృతి అమలు చేయాలన్నారు.

ఎంపీడీఓకు సన్మానం

పగిడ్యాల: బదిలీపై బనగానపల్లెకు వెళ్తున్న ఎంపీడీఓ వెంకటరమణ సేవలు మరువలేనివని ఎంఈఓ సుభాన్ అన్నారు. గురువారం స్థానిక ఎంపీడీఓ కార్యాలయంలో ఏర్పాటు చేసిన బదిలీ సన్మాన కార్యక్రమానికి ఎంఈఓ హాజరయ్యారు. ఆయన్ను ఘనంగా సన్మానించి సేవలను కొనియాడారు. ఎంఈఓ మురళీమోహన్‌రెడ్డి, ఈఓఆర్డీ నాగేంద్రయ్య, సర్పంచ్ పెరుమాళ్ల శేషన్న పాల్గొన్నారు. కాగా ఆయన స్థానంలో వైఎస్సార్ జిల్లా ఖాజీపేట నుంచి వచ్చిన సుమిత్రమ్మ గురువారం ఎంపీడీఓగా బాధ్యతలు తీసుకున్నారు.

7 నుంచి బస్‌పాస్‌లు

ఆత్మకూరు: ఈనెల 7వ తేదీ నుంచి బస్ పాస్‌లు అందజేస్తామని ఆర్టీసీ డిపో మేనేజర్ మహేంద్రుడు గురువారం ఓ ప్రకటనలో తెలిపారు. ఈనెల 5, 6వ తేదీలో వెబ్‌సైట్ సాఫ్ట్‌వేర్ ఆధునికీరిస్తామన్నారు. తర్వాత రోజు నుంచి డిపోలోని కౌంటర్లలో విద్యార్థులతో పాటు మిగతా వర్గాలకు పాసులు ఇస్తామని వెల్లడించారు.

ఆధునిక వ్యవసాయ పద్ధతులు పాటించాలి

వెలుగోడు: ఆధునిక వ్యవసాయ పద్ధతుల పాటించాలని ఏఓ పవన్ కుమార్ రైతులకు సూచించారు. వెలుగోడు గ్రామంలో గురువారం పొలం పిలుస్తోంది కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఏవో మాట్లాడుతూ రైతులకు వ్యవసాయ పనిముట్లు ఇస్తున్నామన్నారు. కార్యక్రమంలో వ్యవసాయ శాఖ అధికారులతో పాటు సెరికల్చర్ టెక్నికల్ ఆఫీసర్ రాజశేఖర్, మత్స్యశాఖ అసిస్టెంట్ ఉదయ్ స్థానిక రైతు సేవ కేంద్రం సిబ్బంది రామకృష్ణ వెంకట శివ నాగమణి పాల్గొన్నారు.

రసాభాసగా సర్వసభ్య సమావేశం

- మెజార్టీ సభ్యుల ఆమోదం మేరకే తీర్మాణం చేయాలన్న ఎంపీటీసీలు
- పట్టుబట్టడంతో పోలీసులను ఆశ్రయించిన ఎంపీడీఓ
- ఎంపీడీఓ, ఎంపీటీసీ సభ్యులకు సర్దిచెప్పిన సీఐ, ఎస్‌ఐ

జూపాడుబంగ్లా: మండల పరిషత్ కార్యాలయంలో గురువారం జరిగిన మండల సర్వసభ్య సమావేశం రసాభాసగా మారింది. మెజార్టీ సభ్యుల ఆమోదం మేరకే తీర్మాణం చేయాలని ఎంపీటీసీ సభ్యులు పట్టుబట్టడంతో ఇన్‌చార్జి ఎంపీడీఓ నూర్జహాన్ పోలీసులను ఆశ్రయించారు. అంతకు ముందు వివిధశాఖల మండల స్థాయి అధికారులు ప్రగతి నివేదికలను చదివి వినిపించారు. చేతిపంపుల మెకానిక్‌ను నియమించాలని, గ్రామంలో ఓహెచ్ఆర్ ట్యాంకు నిర్మాణం పూర్తి చేయించాలని పి.లింగాపురం సర్పంచ్ నాగార్జునరెడ్డి తాగునీటిశాఖ ఏఈ నాగేంద్రను కోరారు. ఓవర్‌హెడ్ ట్యాంకు త్వరగా నిర్మించేలా చేస్తామని ఎంపీడీఓ నూర్జహాన్ తెలిపారు. సిమెంటు రోడ్ల నిర్మాణానికి రూ.2.5 కోట్ల ఉపాధినిధులు మంజూరైనట్లు పీఆర్ ఏఈ బషీర్ తెలిపారు. కేసీ కాల్వ ఏఈ శ్రీనివాసనాయక్ మాట్లాడుతూ.. నవంబర్‌లో సాగునీటి సలహా సంఘాల ఎన్నికలు ఉంటాయన్నారు. కేసీ నీటి వాటాను ఇప్పటి వరకు వినియోగించనందున రబీ పంటలకు సాగునీటికి ఢోకా ఉందన్నారు. మండల హౌసింగ్ ఇన్‌చార్జి జ్యోతి మాట్లాడుతుండగా సర్పంచ్‌లు, ఎంపీటీసీ సభ్యులకు ఎలాంటి సమాచారం లేకుండా ఏకపక్షంగా పక్కాగృహాల వివరాలు ఎలా సేకరిస్తారని వైస్ ఎంపీపీ కృష్ణారెడ్డి నిలదీశారు. అనంతరం ఎంపీపీ సువర్ణమ్మ, ఎంపీటీసీ సభ్యులు తోకల కృష్ణారెడ్డి, నాగమణి, సుజాతమ్మ, నీలమ్మ, కోఆప్షన్ అల్లావుద్దీన్ మాట్లాడుతూ.. ఎన్నికల కంటే ముందు మండల పరిషత్ నిధులతో గ్రామాల్లో చేసిన అభివృద్ధి పనులకు సంబంధించిన బిల్లులు మంజూరు చేయాలని కోరారు. గతంలో చేసిన తీర్మాణాలనే కొనసాగించాలని మెజార్టీ సభ్యులు ఆమోదం తెలిపారు. తీర్మాణం ఆమోదించాలని సభ్యులు ఎంపీడీఓ నూర్జహాన్‌ను పట్టుబట్టారు. అయితే ఆమె సభ్యుల తీర్మాణాన్ని తాను ఆమోదించలేనని సీఈఓ దృష్టికి తీసుకెళ్తానని పేర్కొన్నారు. ఎన్నికల కంటే ముందు చేసిన తీర్మాణాలతో గ్రామాల్లో రూ.38 లక్షల మండల పరిషత్ నిధులు వెచ్చించి చేసిన పనుల బిల్లులు చెల్లించకపోతే తాము అప్పులపాలవుతామని వెంటనే తీర్మాణం ఆమోదించాలని సభ్యులు పట్టుబట్టారు. దీంతో ఇన్‌చార్జి ఎంపీడీఓ పోలీస్‌స్టేషన్‌కు వెళ్లి సభ్యులపై ఫిర్యాదు చేశారు. సీఐ సుబ్రమణ్యం, ఎస్‌ఐ లక్ష్మీనారాయణ సర్దిచెప్పి పంపారు. ఆఫీసుకు వెళ్లి సమస్యను సామరస్యంగా మాట్లాడుకుందామని సభ్యులు అన్నా ఎంపీడీఓ వినిపించుకోకుండా పోలీసు స్టేషన్ నుంచి ఇంటికి వెళ్లిపోయారు.


ఎస్‌ఐకి ఫిర్యాదు చేస్తున్న ఇన్‌చార్జి ఎంపీడీఓ నూర్జహాన్

సమాచార హక్కు చట్టంపై అవగాహన

వెలుగోడు: స్థానిక రైతు సేవా కేంద్రంలో సిబ్బందికి సమాచార హక్కు చట్టంపై ఏఓ పవన్ కుమార్ అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఏవో మాట్లాడుతూ సమాచార హక్కు చట్టం 2005 లోబడి ప్రతి ఒక్క ప్రభుత్వ ఉద్యోగి పని చేయాల్సి ఉంటుందని తెలిపారు. ఉద్యోగులు అవినీతి రహితంగా పని చేయాలంటే ప్రజలు తమ బాధ్యతను సక్రమంగా పోషించాలని చెప్పారు.అనంతరం స్థానిక మండల వ్యవసాయ అధికారి కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమాచార హక్కు చట్టం బోర్డును సిబ్బంది పరిశీలించారు. కార్యక్రమంలో ఏఓ తో పాటు రైతుసేవ కేంద్రం సిబ్బంది రామకష్ణ, నాగలింగం, నాగమణి పలువురు పాల్గొన్నారు.


చట్టాలపై అవగాహన కల్పిస్తున్న ఏఓ

ఆత్మకూరులో భారీ వర్షం

ఆత్మకూరు: ఆత్మకూరు మండలంలో గురువారం సాయంత్రం ఉరుములు, మెరుపులతో కూడిన భారీ వర్షం కురిసింది. ఎడతెరిపి లేకుండా గంట పాటు వానపడటంతో రోడ్లన్నీ జలమయమయ్యాయి. మండలంలోని కాల్వ గ్రామంలో వర్షం నీరు రోడ్లపైకి రావడంతో ప్రజల రాకపోకలకు ఇబ్బంది పడ్డారు.

ప్రతి ఉద్యోగికి బదిలీ సర్వసాధారణం

ఆత్మకూరు: ప్రతి ఉద్యోగికి బదిలీ సర్వ సాధారణమని ఎంపీపీ తిరుపాలమ్మ, వివిధ గ్రామాల సర్పంచ్‌లు శివశంకర్‌నాయక్, రవినాయక్, రాజారెడ్డి, బందెలమాబు, మాణిక్యమ్మ పేర్కొన్నారు. గురువారం ఎంపీడీఓ కార్యాలయంలో ఆత్మకూరు నుంచి కృష్ణగిరికి బదిలీపై వెళ్తున్న ఎంపీడీఓ మోహన్‌కుమార్, సూపరింటెండెంట్ జి.మోహన్‌కుమార్, పంచాయతీ కార్యదర్శులను ప్రజాప్రతినిధులు, స్థానిక అధికారులు ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో ఏపీఎం నాగమ్మ, ఏపీఓ ఉమాదేవి, పుల్లయ్య, కల్యాణ్, ఉపేంద్ర, పంచాయతీ కార్యదర్శులు, వైఎస్సార్‌సీపీ నాయకులు రవినాయక్ తదితరులు పాల్గొన్నారు.

సీపీఐ మండల కార్యదర్శిగా సుధాకర్

పాములపాడు: సీపీఐ మండల కార్యదర్శిగా చిలుక సుధాకర్‌ను గురువారం ఏకగ్రీవంగా ఎనుకున్నట్లు పార్టీ తాలుకా కార్యదర్శి ప్రతాప్ తెలిపారు. ప్రజాసమస్యలపై నిరంతరం పోరాటం చేస్తానని, వారికి న్యాయం జరిగేలా చూస్తానని సుధాకర్ తెలిపారు.

క్రైం కార్నర్

భర్తపై ఫిర్యాదు

మహానంది: అదనపు కట్నం కోసం భర్త వేధిస్తున్నాడని గురువారం ఓ మహిళ పోలీసులను ఆశ్రయించింది. మహానంది మండలం సీతారామపురం గ్రామానికి చెందిన దేవరశెట్టి సుబ్బరత్నమ్మకు ప్రకాశం జిల్లా గిద్దలూరుకు చెందిన రంగనాయకులుతో కొన్నేళ్ల క్రితం వివాహమైంది. ఇటీవల అదనపు కట్నం కింద మరో రూ. పదిలక్షలు కావాలని భర్తతో పాటు అత్త, మామ, బంధువులైన రంగస్వామి, భాగ్యలక్ష్మి, రంగలక్ష్మి, జగన్మోహన్ రావు ఆమెను వేధిస్తున్నారు. ఈమేరకు బాధితురాలి ఫిర్యాదుతో కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ రామ్మోహన్‌రెడ్డి తెలిపారు.

రోడ్డు ప్రమాదంలో యువకుడికి గాయాలు

మహానంది: నంద్యాల-గిద్దలూరు నల్లమల ఘాట్‌రోడ్డులో సర్వనరసింహస్వామి ఆలయం సమీపంలోని మలుపు వద్ద బైక్ అదుపుతప్పి కింద పడింది. గురువారం జరిగిన ఈ ఘటనలో ప్రకాశం జిల్లా కంభం గ్రామానికి చెందిన షేక్ అలీబాషాకు గాయాలయ్యాయి. ఈ యువకుడు పని మీద నంద్యాలకు వచ్చి తిరిగి వెళ్తుండగా మలుపు వద్ద బైక్ అదుపుతప్పి లోయలోకి దూసుకెళ్లింది. దీంతో తీవ్రంగా గాయపడిన అలీబాషాను స్థానికులు గుర్తించి చికిత్స నిమిత్తం నంద్యాల ప్రభుత్వాస్పత్రికి తరలించారు.